తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
# ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | శుక్రవారం - 19- జూన్ 2026 | సంపుటి : 4 | సంచిక : 15 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in




# దేశమంతా వర్షాల కొరత..

- లడఖ్‌లో మాత్రం రెట్టింపు వర్షపాతం
- సాధారణం కంటే 96 శాతం అధిక వర్షం నమోదు
- దేశవ్యాప్తంగా 40 శాతం వర్షపాతం లోటు
- హిమాలయ ప్రాంతాల్లో మారుతున్న వాతావరణం ఆందోళనకరం

**న్యూఢిల్లీ, జూన్ 17 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాల పురోగతి మందగించడంతో అనేక రాష్ట్రాలు వర్షాల కొరతను ఎదుర్కొంటున్నాయి. జూన్ 4 నుంచి 17 వరకు నమోదైన వర్షపాతం గణాంకాలు ఈ పరిస్థితిని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. సాధారణంగా ఈ కాలంలో దేశంలో 65.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవ్వాల్సి ఉండగా, ఈసారి కేవలం 39.7 మిల్లీమీటర్ల వర్షమే కురిసింది. దీంతో దేశవ్యాప్తంగా సగటున 40 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. అయితే దేశమంతా వర్షాల కోసం ఎదురుచూస్తున్న వేళ హిమాలయ ప్రాంతంలోని లడఖ్ మాత్రం భిన్నమైన పరిస్థితిని చవిచూసింది. సాధారణంగా పొడి వాతావరణం ఉండే ఈ ఎడారి ప్రాంతంలో ఆశించిన దానికంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.

మిగతా 2లో



# తెలంగాణ డిజిటల్ క్యాబినెట్‌కు ఆమోదం

- పేపర్‌లెస్ పాలనకు ప్రభుత్వం కీలక నిర్ణయం
- మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌ల పంపిణీ
- డిజిటల్ విధానాన్ని పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ పాలన దిశగా మరో కీలక అడుగు వేసింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశాలను పూర్తిగా పేపర్‌లెస్ విధానంలో నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రుల ప్రత్యేక సమావేశంలో తెలంగాణ డిజిటల్ క్యాబినెట్ నిర్వహణకు అధికారికంగా ఆమోదం లభించింది. డిజిటల్ గవర్నెన్స్‌ను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇకపై మంత్రివర్గ సమావేశాలకు సంబంధించిన ఎజెండా, అంశాలు, నివేదికలు, ప్రతిపాదనలు అన్నీ డిజిటల్ రూపంలోనే అందుబాటులో ఉంటాయి. దీంతో కాగితాల వినియోగం గణనీయంగా తగ్గనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులందరికీ ప్రత్యేక ట్యాబ్‌లను సమాచార సాంకేతిక శాఖ మంత్రి శ్రీధర్ బాబు అందజేశారు.

మిగతా 2లో

## నీట్ విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో
# ఉచిత ప్రయాణం

- జూన్ 21న జరిగే రీ-నీట్ పరీక్షకు ప్రత్యేక సౌకర్యం
- హాల్ టికెట్ చూపిస్తే ఉచిత ప్రయాణానికి అనుమతి
- విద్యార్థుల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం

2






# రైతు భరోసా నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

- జూన్ 30న మధిరలో రైతుల సమ్మేళనం
- ఏడు రకాల సన్న ధాన్యాలకు బోనస్ ప్రకటింపు
- నీట్ విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):**

వానాకాలం పంటల సాగుకు రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రుల సమావేశం నిర్ణయించింది. ఈ నెల 30న ఖమ్మం జిల్లా మధిరలో భారీ స్థాయిలో రైతుల సమ్మేళనం నిర్వహించి, అదే వేదికపై రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించాలని తీర్మానించింది. నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియ ప్రారంభం కానుంది. రైతులకు మరింత ప్రోత్సాహం కల్పించే ఉద్దేశంతో ఏడు రకాల సన్న ధాన్యాలకు బోనస్ చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్కెట్ డిమాండ్, వినియోగం, అధిక దిగుబడి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని బీపీటీ5204, ఆర్ఎన్ఆర్15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం1638, డబ్ల్యూజీఎల్44, కేఎన్ఎం7715 రకాల ధాన్యాలకు బోనస్ వర్తింపజేయనుంది.

మిగతా 2లో

# ఆర్టీసీ ఉద్యోగులకు 11 శాతం ఫిట్‌మెంట్ అమలు

**ప్రజా పాలన 30 నెలల పురోగతిపై సమీక్ష**

**గుర్తింపు సంఘాల ఎన్నికలకు త్వరలో షెడ్యూల్**

**రవాణా సేవల విస్తరణకు కార్యాచరణ**

హైదరాబాద్, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు): ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికులకు మెరుగైన సేవల అందింపుపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సమ్మె సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్పీఎస్-2021కు సంబంధించిన 11 శాతం ఫిట్‌మెంట్‌ను జూలై 1 నుంచి అమలు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఈ నిర్ణయంతో ఆర్టీసీ ఉద్యోగులకు ఆర్థికంగా ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను కూడా త్వరలో ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్‌ను త్వరితగతిన విడుదల చేసి

మిగతా 2లో






# యూరియా యాప్ రద్దు చేయాలని బీఆర్ఎస్ మహాధర్నా

- రైతులకు ఆంక్షలు లేకుండా ఎరువుల పంపిణీ డిమాండ్
- వేల్పూర్ క్రాస్ రోడ్ వద్ద జాతీయ రహదారిపై ఆందోళన
- రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాన్ని కోరిన మాజీ మంత్రి

**నిజామాబాద్, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):**

రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తూ యూరియా పంపిణీలో అమలు చేస్తున్న యాప్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. వేల్పూర్ క్రాస్ రోడ్ వద్ద జాతీయ రహదారి 63పై రైతులతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం అమలు చేస్తున్న యూరియా యాప్ కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఎరువుల కోసం రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వ్యవసాయ పనులు సకాలంలో జరగకుండా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

మిగతా 2లో

# తెలంగాణ డిజిటల్ క్యాబినెట్‌కు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ట్యాబ్‌ల ద్వారా మంత్రులు సమావేశాలకు సంబంధించిన అన్ని వివరాలను సులభంగా పరిశీలించవచ్చు. ఆధునిక సాంకేతికత వినియోగంతో నిర్ణయాల ప్రక్రియ మరింత వేగవంతం కానుందని అధికారులు తెలిపారు. డిజిటల్ క్యాబినెట్ అమలు విధానాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ట్యాబ్‌లలో అందుబాటులో ఉన్న సమాచారం, ఎజెండా ప్రదర్శన, డిజిటల్ నిర్వహణ విధానంపై ఆయన అధికారులతో చర్చించారు. వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేలా అవసరమైన సూచనలు చేశారు.

ఈబుక్ విధానం ద్వారా మంత్రులకు క్యాబినెట్ సమావేశాలకు సంబంధించిన అన్ని అంశాలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో సమాచార మార్పిడి సులభతరం కావడంతో పాటు సమయం, వ్యయం కూడా ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.







పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ నిర్ణయం దోహదపడనుంది. పేపర్‌లెస్ గవర్నెన్స్ లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల్లో డిజిటల్ క్యాబినెట్ ఒక ముఖ్యమైన ముందడుగుగా అధికారులు పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిపాలనలో విస్తృతంగా వినియోగిస్తూ పారదర్శక, సమర్థవంతమైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

## నీట్ విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

**హైదరాబాద్, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** జూన్ 21న నిర్వహించనున్న నీట్ (రీనీట్) పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక నిర్ణయం తీసుకుంది. పరీక్ష రాసే విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, సమయానికి చేరుకునేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. విద్యార్థులపై ప్రయాణ భారం తగ్గించి వారికి సహకారం అందించడమే లక్ష్యమని పేర్కొంది.

నీట్ పరీక్ష రాసే విద్యార్థులు తమ హాల్ టికెట్‌ను ఆర్టీసీ సిబ్బందికి చూపిస్తే ఉచితంగా ప్రయాణించవచ్చని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష రోజున




విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించింది.

ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాస్తుండగా, పరీక్షా కేంద్రాలు దూర ప్రాంతాల్లో ఉండే సందర్భాల్లో ప్రయాణ సమస్యలు ఎదురవుతుంటాయి. అలాంటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు పరీక్షకు ముందుగానే ప్రయాణ ప్రణాళిక రూపొందించుకోవాలని, హాల్ టికెట్‌ను వెంట తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

# దేశమంతా వర్షాల కొరత..

(మొదటి పేజీ తరువాయి)

ఐఎండీ గణాంకాల ప్రకారం లడఖ్‌లో ఈ కాలంలో 2.2 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా, 4.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది సాధారణం కంటే 96 శాతం అధికం కావడం విశేషం.

మరోవైపు దేశంలోని పలు రాష్ట్రాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. మహారాష్ట్ర, గుజరాత్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో వర్షాల లోటు 60 శాతం నుంచి దాదాపు 100 శాతం వరకు నమోదైంది. వ్యవసాయ కార్యకలాపాలు ప్రారంభమయ్యే కీలక సమయంలో వర్షాలు లేకపోవడం రైతుల్లో ఆందోళన పెంచుతోంది. పంటల సాగు, నీటి నిల్వలు, భూగర్భ జలాలపై కూడా దీని ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. లడఖ్‌లో అధిక వర్షపాతం నమోదుకావడానికి ప్రత్యేక వాతావరణ పరిస్థితులే కారణమని నిపుణులు చెబుతున్నారు. ఉత్తర భారతదేశంపై ప్రభావం చూపుతున్న పశ్చిమ అలజడులు, పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన తేమ కలిసి అక్కడ వర్షాలకు అనుకూల పరిస్థితులు సృష్టించాయి. సాధారణంగా దేశంలోని ఇతర ప్రాంతాలు నైరుతి రుతుపవనాలపై ఆధారపడితే, లడఖ్ వాతావరణం మాత్రం పశ్చిమ అలజడులు మరియు అక్కడి భౌగోళిక పరిస్థితుల ప్రభావానికి ఎక్కువగా లోనవుతుంటుంది.



లడఖ్‌లో నమోదైన 4.3 మిల్లీమీటర్ల వర్షం ఇతర ప్రాంతాలతో పోలిస్తే పెద్ద మొత్తంగా కనిపించకపోయినా, ఆ ప్రాంత సాధారణ వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే ఇది గణనీయమైన పెరుగుదలగా భావిస్తున్నారు. సాధారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతంలో దాదాపు రెట్టింపు వర్షం కురవడం వాతావరణ మార్పులపై మరోసారి చర్చకు దారితీసింది. హిమాలయ ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయన్న ఆందోళనలు ఇప్పటికే శాస్త్రవేత్తల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎక్కువగా మంచు కురిసే లేదా పొడి వాతావరణం ఉండే ప్రాంతాల్లో ఇప్పుడు తరచూ వర్షాలు కురుస్తుండటం కొత్త సవాళ్లకు దారితీస్తోంది. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, హిమ సరస్సులు తెగిపోవడం వంటి ప్రమాదాలు పెరిగే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే జూన్ 20 తర్వాత అరేబియా సముద్రం నుంచి తేమ ప్రవాహం పెరగడంతో దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు ఊపందుకునే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

## రైతు భరోసా నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం






(మొదటి పేజీ తరువాయి)

రైతులు నాణ్యమైన సన్న ధాన్యాల సాగుకు ప్రోత్సాహం పొందేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

ఈ ఏడాది తెలంగాణ రైతులు దేశంలోనే రికార్డు స్థాయిలో అత్యధిక ధాన్యం ఉత్పత్తి చేశారని మంత్రులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి కొత్త రికార్డు సృష్టించిందన్నారు. అయితే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి తక్కువ ధాన్యాన్ని సేకరిస్తోందని మంత్రివర్గ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో పండిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కేంద్రాన్ని కోరింది. వానాకాలం సీజన్‌కు అవసరమైన ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కూడా సమావేశం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువుల సరఫరా నిరంతరంగా కొనసాగాలని, ఇందుకోసం ఇప్పటికే పలుమార్లు కేంద్రానికి లేఖలు రాసినట్లు మంత్రులు తెలిపారు. రామగుండం ఎఫ్‌సీఐలో ఉత్పత్తి అవుతున్న యూరియాలో అధిక భాగం తెలంగాణకే కేటాయించాలని కూడా డిమాండ్ చేశారు.

హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు సమావేశం వెల్లడించింది. నగర ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రయాణికుల అవసరాల దృష్ట్యా మెట్రో విస్తరణ అత్యంత కీలకమని పేర్కొంది. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు ఈ అంశంలో సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ఇక జూన్ 21న జరగనున్న జాతీయ స్థాయి నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. రాష్ట్రంలోని 208 పరీక్ష కేంద్రాల్లో దాదాపు 2 లక్షల 95 వేల మంది విద్యార్థులు పరీక్ష రాయనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క మీడియాకు తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చని వెల్లడించారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు 11 శాతం ఫిట్‌మెంట్ అమలు

(మొదటి పేజీ తరువాయి)

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నాగర్‌కర్నూల్, పెద్దపల్లి డిపో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన బస్ స్టేషన్‌ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేపట్టి సకాలంలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. విధుల్లో ఉండగా ఆత్మహత్యకు పాల్పడిన ఉద్యోగి



శంకర్ కుటుంబానికి ప్రకటించిన రూ.1 కోటి ఆర్థిక సాయం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.

దక్షిణ భారత రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, ప్రధాన కార్యదర్శులు, కమిషనర్లు, ఆర్టీసీ ఎండీలతో త్వరలో సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునికీకరించడం, సేవల నాణ్యత పెంపు, సంస్థ ఆర్థిక బలోపేతంపై ఆ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

# బాధిత బాలికకు శస్త్రచికిత్స..
# రూ.5 లక్షల ఆర్థిక సాయం

- నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించిన సీతక్క
- తల్లిదండ్రులకు ధైర్యం చెప్పిన జస్టిస్ పంచాక్షరి
- ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా

**హైదరాబాద్, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):**

ఖమ్మం జిల్లాలో లైంగిక దాడికి గురై ప్రస్తుతం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి జస్టిస్ పంచాక్షరి నిమ్స్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా బాలికకు అందుతున్న వైద్య చికిత్స, శస్త్రచికిత్స అనంతర ఆరోగ్య పరిస్థితిపై వైద్య బృందం మంత్రికి వివరాలు అందించింది. బాలిక ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఆమె కోలుకునేందుకు ప్రత్యేక వైద్య బృందం సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం మంత్రి సీతక్క, జస్టిస్ పంచాక్షరి బాలిక తల్లిదండ్రులను కలిసి పరామర్శించారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని



సూచిస్తూ కుటుంబ సభ్యులకు మానసిక బలాన్ని అందించారు. రాష్ట్ర ప్రభుత్వం మీకు అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

బాలిక పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన వైద్యం, సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క తెలిపారు. బాధిత కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున బాధిత బాలిక కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయ చెక్కును మంత్రి సీతక్క, జస్టిస్ పంచాక్షరి కలిసి అందజేశారు. చికిత్స, పునరావాసం, కుటుంబ అవసరాల కోసం ఈ సాయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అవసరమైతే మరింత సహాయం అందించేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.


బాలిక ఆరోగ్యం మెరుగుపడి సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సీతక్క పునరుద్ఘాటించారు. కుటుంబానికి అవసరమైన న్యాయపరమైన, ఆర్థికపరమైన సహాయాన్ని అందించడంతో పాటు బాధితురాలికి న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# యూరియా యాప్ రద్దు చేయాలని బీఆర్ఎస్ మహాధర్నా

(మొదటి పేజీ తరువాయి)

రైతు అవసరాలను దృష్టిలో ఉంచుకుని యాప్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులకు ఎకరానికి నాలుగు సంచుల యూరియాను ఎలాంటి పరిమితులు లేకుండా ఒకేసారి అందించాలని ఆయన కోరారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల కారణంగా రైతులు పలుమార్లు ఎరువుల కోసం తిరగాల్సి వస్తోందని విమర్శించారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సహకార సంఘాలు, ఎరువుల దుకాణాల్లో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు ఉంచాలని డిమాండ్ చేశారు. ఎరువుల కొరత కారణంగా రైతులు ప్రైవేట్ మార్కెట్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి రాకూడదన్నారు. వ్యవసాయ





రంగాన్ని బలోపేతం చేయాలంటే రైతులకు అవసరమైన ఇన్‌పుట్లు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

మహాధర్నాలో పాల్గొన్న రైతులు కూడా తమ సమస్యలను ప్రస్తావించారు. యూరియా కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, సమయానికి ఎరువులు అందక పంటలపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. రైతు ప్రయోజనాలకు భంగం కలిగించే విధానాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమం కోసం అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇచ్చి రైతులకు అన్ని విధాలా అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
శుక్రవారం - 19 - జూన్ 2026


# ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా సర్పంచ్ అంబాల రాజ్ కుమార్



**ఎల్కతుర్తి, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన బొంకూరి శేఖర్ ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ అంబాల రాజ్ కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ భాగస్వామిగా ఉంటూ వారికి అండగా నిలుస్తున్న సర్పంచ్ మరోసారి తన సేవా భావాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేసి చేయూతనిచ్చారు. కుటుంబ సభ్యులను ఓదార్చిన ఆయన, కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ గ్రామ ప్రజలంతా వారికి అండగా ఉంటారని భరోసా కల్పించారు. బొంకూరి శేఖర్ మృతి కుటుంబానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

సర్పంచ్ అంబాల రాజ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని, ఏ కుటుంబం కష్టాల్లో ఉన్నా తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. గ్రామంలో ఐక్యత, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాజారాం, దాసరాపు రాజమౌళి, సందెల నరేష్, కడారి సందీప్, మిట్టపెల్లి దినేష్, సాత్తూరి నరేష్, బొంకూరి మైసయ్య, భాస్కర్ తదితరులు పాల్గొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సర్పంచ్ అంబాల రాజ్ కుమార్‌ను పలువురు అభినందించారు.

# సొంతింటి కలను నిజం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు



- **కాంగ్రెస్ సీనియర్ నాయకులు శీలం అనిల్ కుమార్**

**ఎల్కతుర్తి,జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):**ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, నిరుపేద కుటుంబాల ఎన్నో ఏళ్ల సొంతింటి కల నెరవేరుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు శీలం అనిల్ కుమార్ అన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు పథకం కింద రూ.5 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న లబ్ధిదారులు బండారి లక్ష్మీ-రాజు, అల్లం శిరీష-రాజు కుటుంబాల గృహ ప్రవేశ కార్యక్రమాన్ని గురువారం ఎంపీడీవో విజయ్ కుమార్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు శీలం అనిల్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవితం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇల్లు లేని కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివాస సమస్యను తగ్గించడంతో పాటు పేద కుటుంబాల్లో భద్రతా భావనను పెంపొందించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం అండగా నిలిచి గృహ నిర్మాణానికి అవసరమైన సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్త ఇంటిలో అడుగుపెట్టిన కుటుంబాలు ఆనందంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ, వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని శుభాకాంక్షలు తెలిపారు. గృహ ప్రవేశం చేసిన కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ గొడిశాల రాజయ్య, పాక రమేష్, శనిగరపు వెంకటేష్-స్వరూప, యువ కాంగ్రెస్ నాయకులు గోడిశాల అర్జున్ గౌడ్, హౌసింగ్ ఏఈ ప్రవీణ్, నాగరాజు, కిరణ్, వీణవంక రమేష్ చారి, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో ప్రైవేట్ ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్

**హుజూరాబాద్, జూన్ 18(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలల్లో యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయని ఏబీవీఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాము ఆరోపించారు. బీటెక్ ఫీజుల కంటే ఎల్‌కేజీ ఫీజులే ఎక్కువగా ఉన్నాయని ఆయన విమర్శించారు. అదనంగా అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారని, దీనివల్ల సామాన్య కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టెక్స్ పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రిని కూడా పాఠశాలలే విక్రయిస్తూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, అక్రమ వసూళ్లను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చకుండా ప్రభుత్వం పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని కోరారు.

# ఖమ్మం ఘటన... నిందితుడికి కఠిన శిక్ష విధించాలి

- **రజక ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ నాయకుల డిమాండ్**
- **ఘటనను ఖండిస్తూ...తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన నాయకులు**

**హన్మకొండ,జూన్18(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లాలో మైనర్ బాలికపై జరిగిన అమానుష ఘటన పట్ల రజక ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఉల్లెంగల కొమురెల్లి, ప్రధాన కార్యదర్శి పంతంగి సమ్మయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను అత్యంత హేయమైన, సభ్య సమాజం తలదించుకునే చర్యగా అభివర్ణిస్తూ ఘాటుగా స్పందించారు.అమాయక చిన్నారులపై ఇలాంటి దారుణాలు జరగడం అత్యంత ఆందోళనకరమని వారు పేర్కొన్నారు.





మహిళలు, చిన్నారుల భద్రతకు ముప్పుగా మారుతున్న ఇలాంటి నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం మరింత కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితుడిపై అత్యంత కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రత్యేక న్యాయస్థానం ద్వారా వేగవంతంగా విచారణ పూర్తి చేసి బాధిత కుటుంబానికి త్వరితగతిన న్యాయం అందించాలని కోరారు. నేరస్తులకు కఠిన శిక్షలు అమలు చేసినప్పుడే ఇటువంటి ఘటనలకు అడ్డుకట్ట పడుతుందని వారు స్పష్టం చేశారు. మహిళలు, చిన్నారుల రక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రభుత్వం, అధికార యంత్రాంగం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. బాధిత బాలికకు, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో వారికి సమాజం అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- **మత స్వేచ్ఛ ప్రతి భారత పౌరుడి రాజ్యాంగ హక్కు**

**హుజూరాబాద్, జూన్ 18(తెలంగాణ ముచ్చట్లు ):** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని క్రిస్టియన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సొల్లు బాబు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు.

భారతదేశం ప్రజాస్వామ్య దేశమని, ప్రతి పౌరుడికి తనకు నచ్చిన మతాన్ని స్వీకరించే హక్కును భారత రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఈ హక్కులను ఎంతో దూరదృష్టితో రాజ్యాంగంలో పొందుపరిచారని గుర్తు చేశారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన మత గ్రంథాలను చదవవచ్చని, చర్చిలు, దేవాలయాలు, మసీదులు, ఇతర ప్రార్థనా మందిరాలను సందర్శించవచ్చని తెలిపారు. బైబిల్, భగవద్గీత, ఖురాన్, బౌద్ధ గ్రంథాల్లోని మంచి సందేశాలను అధ్యయనం చేయడం వల్ల సమాజానికి మేలు జరుగుతుందే తప్ప, కులాలు లేదా సామాజిక వర్గాలు మారిపోవని స్పష్టం చేశారు.

కొన్ని రాజకీయ శక్తులు మతాల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆయన విమర్శించారు. మత విశ్వాసాలను రాజకీయాలకు ఉపయోగించకుండా రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని పిలుపునిచ్చారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించి వారికి రాజ్యాంగబద్ధమైన హక్కులు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని సొల్లు బాబు కోరారు. సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.



# పెద్దమందడిలో పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు

**పెద్దమందడి,జూన్18( తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి గ్రామ పంచాయతీ పరిధిలో మిట్ట మధ్యాహ్నం సమయంలోనూ వీధిలైట్లు వెలుగుతుండటంతో విద్యుత్ వృథా అవుతోంది.ఈ విషయాన్ని పలుమార్లు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.ప్రభుత్వం విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ, గ్రామంలో ఇలాంటి పరిస్థితులు కొనసాగడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనం వృథా కాకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# రాజపల్లిలో ఆర్‌టీఐ కమిటీకి కొత్త నాయకత్వం

- **రాజపల్లి గ్రామ అధ్యక్షుడిగా శనిగరం రవీందర్ ఏకగ్రీవ ఎన్నిక**

**హుజూరాబాద్, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని రాజపల్లి గ్రామంలో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) సాధన కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్‌టీఐ సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశంలో చెల్పూర్ గ్రామ ఆర్‌టీఐ సాధన కమిటీ నూతన అధ్యక్షుడిగా శనిగరం రవీందర్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం శనిగరం రవీందర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, కాట్రపల్లి గ్రామ అధ్యక్షుడు ఎం. రాజు, హుజూరాబాద్ మండల ప్రధాన కార్యదర్శి బండ నరేందర్‌తో పాటు కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెంపొందించడంతో పాటు ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఆర్‌టీఐ వేదికగా నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు.ప్రజలకు అవసరమైన సమాచారాన్ని చట్టబద్ధంగా అందించడంతో పాటు, ప్రభుత్వ వ్యవస్థలో జవాబుదారీతనం పెంచేందుకు ఆర్‌టీఐ ఉద్యమాన్ని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. నూతన అధ్యక్షుడి ఎన్నికతో రాజపల్లిలో ఆర్‌టీఐ సాధన కమిటీ కార్యకలాపాలు మరింత విస్తరించి, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని సమావేశంలో పాల్గొన్న సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.







# పెద్దమందడి పోలీస్‌స్టేషన్ వార్షిక తనిఖీ నిర్వహించిన ఎస్పీ సునిత రెడ్డి

**పెద్దమందడి,జూన్18(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్., గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి పరిశీలించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. స్టేషన్ రికార్డులు, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల స్థితి, విధుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు న్యాయం చేయడం, బాధితుల్లో భరోసా పెంపొందించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని అన్నారు. స్టేషన్ పరిధిలో గంజాయి, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా ఉంచాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి, నాణ్యమైన దర్యాప్తుతో కోర్టుల్లో చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్2.0, టీఎస్‌కాప్, సైబర్ క్రైమ్ పోర్టల్ తదితర సాంకేతిక వ్యవస్థలపై పూర్తి అవగాహన పెంపొందించుకుని నేరాల నియంత్రణలో సమర్థవంతంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని చెప్పారు.రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అనంతరం ఎస్సై జలంధర్ రెడ్డి జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేశారు.పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టును ప్రారంభించి విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ గిరిబాబు, సీఐ రాంబాబు, ఎస్సై జలంధర్ రెడ్డి, డీసీఆర్‌బీ ఎస్సై తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం.. మనోధైర్యం నింపిన సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్



**పెద్దమందడి,జూన్18(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో ఇటీవల అకాల మరణానికి గురైన గొల్ల సాయన్న యాదవ్, బాలకిష్టయ్య కుటుంబాలను గ్రామ సర్పంచ్ పలుసు శ్రీనివాస్ గౌడ్ పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. మనోధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఒక్కో కుటుంబానికి రూ.3,000/ చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి ఆపద వచ్చినా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. గొంది రామకృష్ణారెడ్డి, బుచ్చన్న, వెంకటయ్య, బాలరాజు, కావలి ఉషన్న, కురుమన్న రాములు, మందడి శ్రీను, రామస్వామి, శ్రీకాంత్ రెడ్డి, బోడి గణేష్, రామాంజనేయులు, సాయికుమార్ పాల్గొన్నారు.

## గ్రామదేవత ఆలయం పక్కన చర్చి



- **నిర్మాణంపై బీజేపీ అభ్యంతరం.**
- **అనుమతులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి.**

**అశ్వరావుపేట, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వరావుపేట మండలం గాండ్లగూడెం గ్రామంలో గ్రామదేవత ఆలయానికి ఆనుకుని చర్చి నిర్మాణం చేపడుతున్నారంటూ బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్మాణం హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని బీజేపీ నాయకుడు తంబళ్ల రవి ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ, గ్రామదేవత ఆలయానికి సమీపంలో చేపడుతున్న నిర్మాణంపై రెవెన్యూ, పోలీసు శాఖలు వెంటనే విచారణ జరిపి, నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై గ్రామస్థులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. గ్రామంలో మత సామరస్యానికి భంగం కలిగించే చర్యలను అనుమతించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో గంగిశెట్టి వరప్రసాద్, భూక్య మల్లేశ్వర నాయక్, కృష్ణా స్వరూప్ రాథోడ్, భూక్య ప్రసాద్, వినోద్, చందు నాయక్ తదితర బీజేపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పాలాభిషేకాలతో కృతజ్ఞతలు.. రూ.45 కోట్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



- **ప్రణవ్ బాబు కృషితో సాధ్యమైన అభివృద్ధి: కాంగ్రెస్ నేతల హర్షం**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రణవ్ బాబుకు పాలాభిషేకం**

**జమ్మికుంట టౌన్ జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల పరిధిలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా రూ.45 కోట్ల వ్యయంతో మురుగునీటి శుద్ధీకరణ యంత్రాంగం (ఎస్‌టీపీ) మంజూరు కావడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ ప్రాజెక్టు మంజూరులో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ ఒడితల ప్రణవ్ బాబు కీలక పాత్ర పోషించారని నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో చర్చించి ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించడంలో ప్రణవ్ బాబు విశేష కృషి చేశారని కొనియాడారు. హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఇది ఒక గొప్ప కానుకగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ బాబులకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సాయిని రవి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మొలుగూరి సదయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పొనగంటి మల్లయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు ఒగ్గు రమేష్, ఎగిత అశోక్, కుతాడి తిరుపతి, పాతకాల అనిల్, ముద్దమల్ల రవి, యాట్ల అశోక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి లింగారావు, నాగమల్లి అశోక్, పొనగంటి రవీందర్, పొనగంటి మధు, పోతుల శ్రీనివాస్, పాత ప్రసాద్ రెడ్డి, రాజ్‌కుమార్, కమలాకర్, ప్రవీణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.

# లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలు కట్టుదిట్టంగా పాటించాలి....

### జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్





**ఖమ్మం బ్యూరో,జూన్ 18(తెలంగాణ ముచ్చట్లు ):** లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలను కట్టుదిట్టంగా పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు.

జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ కాన్ఫరెన్ హాల్లో జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి పాల్గొన్నారు.

పెండింగ్ ఉన్న లేఔట్ అనుమతులపై కలెక్టర్ సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఇతర లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించి, ప్రతి లే అవుట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ లేఔట్ అనుమతులకు వచ్చిన 17 దరఖాస్తులను కమిటీ పరిశీలించిందని అన్నారు. లేఔట్ అనుమతులను మంజూరు చేసే సమయంలో తప్పనిసరిగా ఎటువంటి వాటర్ బాడి ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్ పరిధిలో రాకుండా జాగ్రత్త పడాలని అన్నారు.

లేఔట్ లో అప్రోచ్ రోడ్డు 18 మీటర్లు ఉండాలని అన్నారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన మేర భూమి లే ఔట్ లో కేటాయింపులు జరిగేలా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. లేఔట్ ప్రాంతం నీటి వనరులు, నీటి ప్రవాహాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని, ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ లలో అనుమతులు జారీ చేయడం కుదరదని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్, మండల సర్వేయర్, ఆర్డిఓ లు సంయుక్తంగా లేఔట్ దరఖాస్తును చుట్టు పక్కల సర్వే నెంబర్లను పరిశీలించి రిపోర్ట్ అందించాలని అన్నారు.

లేఔట్ ప్రాంతంలో గతంలో ఏమైనా నీటి వనరులు ఉన్నాయా అని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా సాంకేతికతను వినియోగిస్తూ పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. లేఔట్ ఆమోద ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, నిబంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయాలని, మనం జారీ చేసిన అనుమతుల నిబంధనలను అభివృద్ధి సమయంలో పాటిస్తున్నారు లేదో పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ఎస్.డి.సి. సదానందం, ఇర్రిగేషన్ సిఇ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, పి ఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ. శ్రీనివాసా చారి, సుడా సిపిఓ రాజ్ కుమార్, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి.. కార్మికులకు అండగా నిలిచిన మున్సిపల్ చైర్మన్

- **కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ**




**జమ్మికుంట టౌన్ జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపు మేరకు జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల రిలే దీక్షలకు మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న డిమాండ్లు పూర్తిగా న్యాయబద్ధమైనవేనని పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, రెండో పీఆర్సీ ప్రకటించి కనీస వేతనాన్ని రూ.26 వేలుగా నిర్ణయించి కేటగిరీ వారీగా వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు. కార్మికులకు రోజుకు 8 గంటల పని విధానం అమలు చేయడంతో పాటు శానిటేషన్, వాటర్‌వర్క్స్, హరితహారం, ఎలక్ట్రిషియన్లు, డ్రైవర్లకు ప్రతి సంవత్సరం రక్షణ పరికరాలు అందజేయాలని సూచించారు.మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న డ్రైవర్లు, జవాన్లకు ఇతర ఉద్యోగుల మాదిరిగానే డ్రైవర్ కేటగిరీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తమ వంతు సహకారం అందిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొలుగూరి సురేష్, ఫిరోజ్, మంద రాజేష్, శంకర్‌తో పాటు మున్సిపల్ కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# భావితరాలకు హరిత వారసత్వమే లక్ష్యం!





### ఎమ్మెల్యే రాగమయి

**సత్తుపల్లి, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** భావితరాలకు పచ్చని పర్యావరణాన్ని అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పిలుపునిచ్చారు. పెనుబల్లి మండలం రామచంద్రపురం గ్రామ పంచాయతీ పరిధిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం లంకపల్లి పాఠశాల విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటుతూ పచ్చదనం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో చెట్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే హరిత తెలంగాణ లక్ష్యం సాకారమవుతుందని అన్నారు. కార్యక్రమంలో పెనుబల్లి తహసీల్దార్, సబ్ ఇన్‌స్పెక్టర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, రామచంద్రపురం సర్పంచ్ ఎస్.కే. రిజ్వానా కరీముల్లా, లంకపల్లి సర్పంచ్ రాజా, అటవీ శాఖ సబ్ డీఎఫ్‌వో, ఎఫ్ఆర్‌వో మల్లయ్య, ఎఫ్‌డీవో, డీఆర్‌వో, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో ఘనంగా టాలీ సర్టిఫైడ్ పార్టనర్ సంస్థ ఆఫీస్ ప్రారంభం

- **ముఖ్య అతిథిగా ఖమ్మం జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉల్లిబోయిన సైదులు**



**ఖమ్మం బ్యూరో , జూన్ 18(తెలంగాణ ముచ్చట్లు ):**వ్యాపారాల అకౌంటింగ్, ఈ ఆర్ పి అవసరాలకు ట్యాలీ సాఫ్ట్‌వేర్ విక్రయాలు, ఈ ఆర్ పి పరిష్కారాలు మరియు సాంకేతిక సహాయ సేవలను అందించే ఎలైట్ ఈ ఆర్ పి సొల్యూషన్స్ ( వి‌ఎల్‌ఎస్ కార్పొరేట్ సర్వీసెస్) సంస్థ ఖమ్మం వైరా రోడ్డులోని సురభి హాస్పిటల్ కాంప్లెక్స్, 2వ అంతస్తులో ఘనంగా ప్రారంభమైంది.

సంస్థ యజమాని గరిడేపల్లి నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ రీజినల్ హెడ్ ఉమేష్ ప్రసాద్ , అఖిల భారత పన్ను నిపుణుల సమాఖ్య జాతీయ కార్యవర్గ సభ్యులు, ఖమ్మం జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉల్లిబోయిన సైదులు ముఖ్య అతిథులుగా హాజరై సంయుక్తంగా రిబ్బన్ కత్తిరించి సంస్థను ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇప్పటి వరకు హైదరాబాద్, బెంగళూరు కేంద్రాల నుండి అందుబాటులో ఉన్న ట్యాలీ సేవలు ఇకపై ఖమ్మంలోనే ప్రత్యక్షంగా లభించడం వల్ల జిల్లా వ్యాప్తంగా టాక్స్ ప్రొఫెషనల్స్, చార్టర్డ్ అకౌంటెంట్లు, వ్యాపార సంస్థలకు మరింత వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందనున్నాయని తెలిపారు. అలాగే ఖమ్మం జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తరపున సంస్థ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

ట్యాలీ సర్టిఫైడ్ శిక్షణ నిపుణులు సీఏ బద్రీనాథ్ నకిరికంటి మాట్లాడుతూ, ట్యాలీ సాఫ్ట్‌వేర్ ప్రాముఖ్యత, వ్యాపార నిర్వహణలో దాని పాత్రతో పాటు తాజా వెర్షన్‌లో అందుబాటులోకి వచ్చిన ఆధునిక ఫీచర్లను వివరించారు. ఈ అవగాహన సదస్సు పాల్గొన్న వారిలో విశేష ఆసక్తిని కలిగించింది.

సంస్థ యజమాని గరిడేపల్లి నరేష్ కుమార్ మాట్లాడుతూ, ట్యాలీ సాఫ్ట్‌వేర్ విక్రయాలు, ఇన్‌స్టాలేషన్, అప్‌గ్రేడేషన్, ఏఎంసి సేవలు, సాంకేతిక సహాయం, జీఎస్టీ సంబంధిత సేవలు, వినియోగదారులకు శిక్షణతో పాటు సమగ్ర ఈఆర్పి పరిష్కారాలను అందించనున్నట్లు తెలిపారు. ఖమ్మం మరియు పరిసర ప్రాంతాల వ్యాపార సంస్థలకు నాణ్యమైన, విశ్వసనీయ సేవలను అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్ , చార్టర్డ్ అకౌంటెంట్లు, జీఎస్టీ & టాక్స్ ప్రాక్టీషనర్లు, వ్యాపారవేత్తలు, అకౌంటెంట్లు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## నూతన విద్యా సంవత్సరానికి ఆత్మీయ స్వాగతం పలికిన సర్పంచ్

**వేలేరు, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బిల్లా యాదగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదవ తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాలు, విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాలలో చదువుతున్న 205 మంది విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, ప్రధానోపాధ్యాయులు సత్తయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## నిరుద్యోగ యువత కోసం ఉచిత ఈ-క్లాసెస్ యాప్ ఆవిష్కరణ

- **నిరుద్యోగ యువత, పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం రూపొందించిన రాకేష్ రెడ్డి**

**హన్మకొండ,జూన్18(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిరుద్యోగ యువత, పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం రూపొందించిన రాకేష్ రెడ్డి ఈ క్లాసెస్ యాప్ ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణా రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, టీఎస్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, ప్రొఫెసర్ తిర్నారి శేషు, ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, న్యూరో వైద్యుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 30 నెలలు కావొస్తున్నప్పటికీ ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పించామని, ప్రతి రెండేళ్లకోసారి పోలీసు ఉద్యోగాల భర్తీ చేపట్టేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యారంగంలో కూడా అధ్యాపక పోస్టుల భర్తీ జరగకపోవడం ఆందోళనకరమని అన్నారు.

యాప్ రూపకర్త ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉచితంగా నాణ్యమైన పోటీ పరీక్షల శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్యమవుతున్న నేపథ్యంలో కోచింగ్ కేంద్రాలకు వెళ్లలేని విద్యార్థులకు ఈ యాప్ ఉపయోగపడుతుందని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణా రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న రాకేష్ రెడ్డికి ప్రజల మద్దతు అవసరమని అన్నారు.బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం రాకేష్ రెడ్డి నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. వివిధ అంశాలపై న్యాయపోరాటాలు కూడా కొనసాగిస్తున్నారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు నిరుద్యోగ యువతకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించేందుకు రూపొందించిన ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



## ఐఫోన్ ధరల పెంపుపై సంకేతాలు

**హైదరాబాద్, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ యాపిల్ వినియోగదారులకు త్వరలో ధరల షాక్ ఇవ్వనున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. సంస్థ ప్రధాన కార్యనిర్వాహక అధికారి టిమ్ కుక్ ఐఫోన్ ధరలను పెంచాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని వ్యాఖ్యానించినట్లు సమాచారం.

రాబోయే నెలల్లో కొత్త తరం ఐఫోన్ విడుదలకు సన్నాహాలు జరుగుతున్న వేళ ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇప్పటివరకు విడిభాగాల ధరలు పెరిగినా ఆ భారం వినియోగదారులపై మోపకుండా సంస్థే భరించిందని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అదే విధానాన్ని కొనసాగించడం కష్టమవుతోందని అభిప్రాయపడినట్లు సమాచారం.

సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ సాంకేతికత విస్తరణతో మెమరీ చిప్‌లకు డిమాండ్ భారీగా పెరిగింది. ముఖ్యంగా కృత్రిమ మేధ ఆధారిత సేవలను అభివృద్ధి చేస్తున్న సంస్థలు పెద్ద ఎత్తున చిప్‌లను వినియోగిస్తున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా సరఫరాపై ఒత్తిడి పెరిగి ధరలు ఎగబాకుతున్నాయి. స్మార్ట్‌ఫోన్‌ల తయారీలో అత్యధికంగా మెమరీ చిప్‌లను వినియోగించే సంస్థల్లో యాపిల్ అగ్రస్థానంలో ఉంది. చిప్‌ల ధరల పెరుగుదల కారణంగా ప్రతి కొత్త ఫోన్‌పై అదనపు వ్యయం గణనీయంగా పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ అదనపు ఖర్చును సంస్థ భరించడం క్రమంగా భారంగా మారుతోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

మరోవైపు కృత్రిమ మేధ రంగం వేగంగా విస్తరిస్తుండటంతో భవిష్యత్తులో మెమరీ చిప్‌ల కోసం పోటీ మరింత పెరిగే అవకాశముంది. దీనివల్ల స్మార్ట్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ వ్యయాలు కూడా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కొత్త ఐఫోన్ శ్రేణి విడుదల సమయంలో ధరలపై సంస్థ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం వెలువడుతున్న సంకేతాల ప్రకారం ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌ల ధరల్లో పెరుగుదల కనిపించే అవకాశముందని టెక్నాలజీ రంగ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఈపీఎఫ్ ఖాతాదారులకు ఊరట.. ఈ నెలలోనే వడ్డీ జమ

**న్యూఢిల్లీ, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. 202526 ఆర్థిక సంవత్సరానికి ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాలపై 8.25 శాతం వార్షిక వడ్డీ చెల్లింపునకు కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. దీంతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఖాతాదారుల పీఎఫ్ ఖాతాల్లో ఈ నెలాఖరులోగా వడ్డీ మొత్తాలు జమయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.




ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ట్రస్టీల కేంద్ర బోర్డు గతంలో 8.25 శాతం వడ్డీ రేటును ప్రతిపాదించగా, తాజాగా కేంద్ర ప్రభుత్వం దానికి అధికారిక ఆమోదం తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో అమలైన వడ్డీ రేటునే ఈ ఏడాది కూడా కొనసాగించడం ఉద్యోగులకు ఊరటనిచ్చే అంశంగా మారింది.

ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, మార్కెట్ ఒడిదుడుకులు, పెట్టుబడులపై రాబడుల్లో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ వడ్డీ రేటును తగ్గించకుండా యథాతథంగా కొనసాగించడం విశేషమని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పదవీ విరమణ తర్వాత ఆర్థిక భద్రత కోసం పీఎఫ్‌పై ఆధారపడే ఉద్యోగులకు ఇది ప్రయోజనకరంగా మారనుంది.

ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాల్లో వడ్డీ లెక్కింపు ప్రతి నెలా జరుగుతుంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి చివరి వరకు ఖాతాలో ఉన్న నిల్వల ఆధారంగా నెలవారీగా వడ్డీని గణిస్తారు. అయితే మొత్తం వడ్డీని ఒకేసారి ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాతే ఖాతాలో జమ చేస్తారు.

మధ్యలో నిధుల ఉపసంహరణ చేసిన ఖాతాదారులకు విత్‌డ్రా చేసిన మొత్తంపై వడ్డీ వర్తించదు. అలాగే చాలా కాలంగా వినియోగంలో లేని లేదా నిష్క్రియ ఖాతాలకు నిబంధనల ప్రకారం వడ్డీ జమ చేయబడదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఇటీవల ఈపీఎఫ్ఓ డిజిటల్ వ్యవస్థలను మరింత ఆధునీకరించిన నేపథ్యంలో వడ్డీ జమ ప్రక్రియ వేగవంతమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గతంలో కేంద్ర ఆమోదం వచ్చిన తర్వాత ఖాతాల్లో వడ్డీ జమ కావడానికి నెలల సమయం పట్టేది. అయితే ప్రస్తుతం సాంకేతిక వ్యవస్థల్లో మార్పుల కారణంగా ఈ ప్రక్రియ త్వరగా పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగులు తమ పీఎఫ్ ఖాతాల్లో వడ్డీ జమ కోసం ఎదురుచూస్తుండగా, ఈ నెలాఖరులోపు ఖాతాల్లో వడ్డీ ప్రతిబింబించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

## స్థిరంగా బంగారం ధరలు

**హైదరాబాద్, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో పెద్దగా హెచ్చుతగ్గులు లేకపోవడంతో దేశవ్యాప్తంగా పసిడి ధరల్లో గణనీయమైన మార్పులు కనిపించలేదు. జూన్ 18 ఉదయం నాటికి హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,51,100గా నమోదైంది. 22 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.1,38,500 వద్ద కొనసాగుతుండగా, 18 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,13,320గా ఉంది. తెలంగాణలోని వరంగల్, నిజామాబాద్, ఖమ్మం నగరాల్లో కూడా హైదరాబాద్‌కు సమానంగానే ధరలు నమోదయ్యాయి. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,51,100, 22 క్యారెట్ల ధర రూ.1,38,500, 18 క్యారెట్ల ధర రూ.1,13,320గా కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, కాకినాడ, తిరుపతి నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పసిడి ధరల్లో ఎలాంటి మార్పు లేకపోవడం కొనుగోలుదారులకు కొంత ఊరటనిస్తోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో పరిశీలిస్తే చెన్నైలో బంగారం ధరలు ఇతర నగరాలతో పోలిస్తే కొంత ఎక్కువగా నమోదయ్యాయి. అక్కడ 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,53,380 కాగా, 22 క్యారెట్ల ధర రూ.1,40,600గా ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,51,250, 22 క్యారెట్ల ధర రూ.1,38,650గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,51,100గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,38,500గా కొనసాగుతోంది. జైపూర్‌లో 24 క్యారెట్ల ధర రూ.1,51,250 కాగా, పట్నా, వడోదరా నగరాల్లో రూ.1,51,150గా నమోదైంది. మరోవైపు వెండి ధరల్లో కూడా పెద్దగా మార్పులు కనిపించలేదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల దిశ, అమెరికా వడ్డీ రేట్ల నిర్ణయాలు, డాలర్ మారకం విలువ ఆధారంగా రాబోయే రోజుల్లో బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ ముగియడంతో కొనుగోళ్లు కొంత మందగించినప్పటికీ, పెట్టుబడి కోసం బంగారం కొనుగోలు చేసే వారి ఆసక్తి కొనసాగుతోంది.



## హైదరాబాద్‌లో టెస్లా కేంద్రం ప్రారంభం

**హైదరాబాద్, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ కార్ల తయారీలో అగ్రగామిగా గుర్తింపు పొందిన టెస్లా సంస్థ తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను విస్తరించింది. నగరంలోని మాదాపూర్ ప్రాంతంలో ఉన్న నాలెడ్జ్ సిటీలో సంస్థ అత్యాధునిక అనుభవ కేంద్రాన్ని అధికారికంగా ప్రారంభించింది. భారతదేశంలో టెస్లాకు ఇది ఐదో ప్రదర్శన కేంద్రం కావడం విశేషం. ఈ కేంద్రం ద్వారా నగరంలోని వాహన ప్రియులు టెస్లా సరికొత్త విద్యుత్ వాహనాలను నేరుగా పరిశీలించి, వాటి ప్రత్యేకతలను తెలుసుకునే అవకాశం పొందనున్నారు. ఈ కేంద్రంలో సంస్థ తాజాగా రూపొందించిన రెండు ప్రధాన వాహన నమూనాలను ప్రదర్శనకు ఉంచింది. అత్యాధునిక సాంకేతికత, అధిక భద్రతా ప్రమాణాలు, మెరుగైన పనితీరుతో రూపొందించిన ఈ వాహనాలు వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సంస్థ ప్రతినిధులు వాహనాల పనితీరు, బ్యాటరీ సామర్థ్యం, ప్రయాణ దూరం, భద్రతా వ్యవస్థలు తదితర అంశాలపై సందర్శకులకు వివరాలు అందిస్తున్నారు. దీంతో కొనుగోలు చేయాలనుకునే వారు వాహనాలను ప్రత్యక్షంగా పరిశీలించి నిర్ణయం తీసుకునే వీలుంది.

కేవలం ప్రదర్శన కేంద్రానికే పరిమితం కాకుండా వినియోగదారులకు పూర్తి స్థాయి సేవలు అందించేందుకు టెస్లా ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా నగర శివార్లలోని బొల్లారం పారిశ్రామిక ప్రాంతంలో ప్రత్యేక వాహన పంపిణీ కేంద్రంతో పాటు సేవల నిర్వహణ కోసం అత్యాధునిక వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసింది. వాహనాల మరమ్మతులు, నిర్వహణ, సాంకేతిక సహాయం వంటి సేవలను అక్కడి నుంచి అందించనుంది. దీంతో వినియోగదారులు సేవల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని సంస్థ పేర్కొంది. కొత్త విద్యుత్ వాహనాల ప్రారంభ ధర రూ.50.89 లక్షలుగా నిర్ణయించారు. ఈ వాహనాల పంపిణీని జూలై నెల నుంచి ప్రారంభించనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇప్పటికే ఆసక్తి ఉన్న వినియోగదారుల నుంచి బుకింగ్‌లను స్వీకరిస్తున్నారు. ముఖ్యంగా జూన్ 30లోపు వాహనాలను బుక్ చేసుకునే వారికి ఇంటి వద్ద ఏర్పాటు చేసుకునే విద్యుత్ చార్జింగ్ పరికరాన్ని ఉచితంగా అందించనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ ప్రకటనతో నగరంలోని విద్యుత్ వాహనాల అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రస్తుతం దేశంలో పర్యావరణ హిత వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో టెస్లా హైదరాబాద్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఐటీ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరం విద్యుత్ వాహనాల మార్కెట్‌కు కూడా ప్రధాన కేంద్రంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. టెస్లా ప్రవేశంతో రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వినియోగం మరింత పెరగడంతో పాటు ఛార్జింగ్ మౌలిక వసతుల విస్తరణకు కూడా ఊతం లభించనుందని ఆటోమొబైల్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# రక్తదాన సేవల బలోపేతానికి కేంద్రం చర్యలు

- **అహ్మదాబాద్‌లో జాతీయ స్థాయి ఎన్జీవో సదస్సు**
- **స్వచ్ఛంద రక్తదానంలో విశేష సేవలకు సత్కారం**
- **రక్త వినియోగానికి జాతీయ టూల్‌కిట్ విడుదల**

దేశంలో రక్త మార్పిడి సేవలను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కీలక చర్యలు చేపట్టింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి స్వచ్ఛంద సంస్థల సదస్సులో రక్తదాన సేవల విస్తరణ, సురక్షిత రక్త సరఫరా వ్యవస్థ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించడంలో విశేష కృషి చేసిన రక్త కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలను ఈ సందర్భంగా సత్కరించారు. రక్తదాన సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారి పాత్రను కేంద్ర ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా అభినందించింది. సమాజంలో రక్తదానంపై అవగాహన పెంపునకు ఈ సంస్థలు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొంది. ఈ కార్యక్రమంలో భాగంగా రక్తం, రక్త భాగాల హేతుబద్ధ వినియోగానికి సంబంధించిన జాతీయ టూల్‌కిట్‌ను విడుదల చేశారు. రక్తం అవసరమైన రోగులకు సరైన సమయంలో, సరైన విధంగా అందేలా మార్గదర్శకాలు రూపొందించామని అధికారులు తెలిపారు. రక్త వినియోగంలో నాణ్యతా ప్రమాణాలను మరింత మెరుగుపరచడమే దీని ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. దేశవ్యాప్తంగా సురక్షితమైన రక్త మార్పిడి సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఈ టూల్‌కిట్ కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. రక్త కేంద్రాలు, వైద్య సంస్థలు శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా సేవలు అందించేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. రక్త నిల్వ, పంపిణీ, వినియోగ ప్రక్రియల్లో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. స్వచ్ఛంద రక్తదానం ప్రాధాన్యంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు కేంద్రం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనుంది. యువత, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల భాగస్వామ్యంతో రక్తదాన ఉద్యమాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించింది. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా నాణ్యమైన, సురక్షిత రక్త సేవలు మరింత బలోపేతం అవుతాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. రక్త అవసరాల సమయంలో ఎవరూ ఇబ్బందులు పడకుండా సమర్థవంతమైన రక్త మార్పిడి వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.



# తప్పుగా పలికిన పేర్లకు గవర్నర్ క్షమాపణ

- **అసెంబ్లీలో తమిళ ప్రముఖుల ప్రస్తావన**
- **ఉచ్చారణలో పొరపాట్లు చేసిన అర్లేకర్**
- **సభలోనే 'నన్ను క్షమించండి' వ్యాఖ్య**

తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అసెంబ్లీలో చేసిన ప్రసంగం సందర్భంగా తమిళ ప్రముఖుల పేర్ల ఉచ్చారణలో జరిగిన పొరపాట్లకు బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. రాష్ట్ర శాసనసభను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తన ప్రసంగంలో పలువురు సామాజిక సంస్కర్తలు, చారిత్రక వ్యక్తుల పేర్లను ప్రస్తావించిన గవర్నర్ కొన్ని పేర్లను సరిగా ఉచ్చరించలేకపోయారు. తమిళ సమాజ అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుల గురించి ప్రస్తావిస్తూ పెరియార్ ఈవీ రామస్వామి, కామరాజ్, రాణి వేలూ నాచియార్, అంజలి అమ్మాల్ వంటి ప్రముఖుల పేర్లను గవర్నర్ చదివారు. అయితే తమిళ భాషలోని కొన్ని పదాలు, పేర్ల ఉచ్ఛారణలో ఇబ్బందులు ఎదురవడంతో కొన్ని పేర్లు తప్పుగా పలికినట్లు గుర్తించారు. దీనిని సభలోనే ప్రస్తావించడం విశేషంగా నిలిచింది.

గోవా రాష్ట్రానికి చెందిన రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌కు తమిళ భాషపై పూర్తి పట్టు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. ప్రసంగం కొనసాగుతున్న సమయంలోనే ఆయన తన పొరపాటును గుర్తించి వెంటనే సభకు క్షమాపణలు చెప్పారు. ఇది సభలో ఉన్న సభ్యుల దృష్టిని ఆకర్షించింది. "నన్ను క్షమించండి.. కొన్ని పేర్లను నేను సరిగా ఉచ్ఛరించలేకపోయి ఉండవచ్చు" అంటూ గవర్నర్ వినయపూర్వకంగా వ్యాఖ్యానించారు. భాషాపరమైన ఇబ్బందుల కారణంగానే ఈ పొరపాటు జరిగిందని ఆయన పరోక్షంగా వెల్లడించారు. గవర్నర్ స్పందనను పలువురు సభ్యులు అభినందించినట్లు సమాచారం.

తన ప్రసంగంలో గవర్నర్ తమిళనాడు రాజకీయ, సామాజిక చరిత్రకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై ఆలోచనలను గుర్తుచేసుకుంటూ ప్రజాస్వామ్య విలువల ప్రాధాన్యాన్ని వివరించారు. అలాగే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం వంటి సూత్రాలను ప్రస్తావించారు. అసెంబ్లీలో జరిగిన ఈ ఘటన ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తమిళ మహనీయుల పట్ల గౌరవంతోనే తాను క్షమాపణలు తెలిపానని గవర్నర్ తన చర్య ద్వారా స్పష్టం చేశారు. భాషా భేదాలు ఉన్నప్పటికీ నాయకుల పట్ల గౌరవం, వినయం చూపడం మంచి పరిణామమని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# నీట్ యూజీ రీ-ఎగ్జామినేషన్ ఏర్పాట్లపై కేంద్రం సమీక్ష

- **ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం**
- **పరీక్షల్లో పారదర్శకతకు ప్రాధాన్యం**
- **విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశం**

నీట్ యూజీ రీఎగ్జామినేషన్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో పరీక్షల నిర్వహణకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, పరిపాలనా చర్యలు, పరీక్షా కేంద్రాల సిద్ధత తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. దేశవ్యాప్తంగా పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను అధికారులు మంత్రికి వివరించారు. పరీక్షల ప్రక్రియలో అత్యున్నత స్థాయి నిజాయితీ, పారదర్శకత, సమర్థతను పాటించాలని ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక పరీక్ష కావడంతో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని పేర్కొన్నారు. ప్రతి దశలో నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వాల నియమిత నోడల్ అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. రీఎగ్జామినేషన్‌కు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఒత్తిడి లేని వాతావరణంలో పరీక్ష రాసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రవాణా, భద్రత, పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో కేంద్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, జాతీయ పరీక్షల సంస్థ అధికారులు, ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. పరీక్షల నిర్వహణలో అన్ని సంస్థలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. విద్యార్థుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పరీక్షల నిర్వహణ జరగాలని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



# బొగ్గు, గనుల రంగాల అభివృద్ధిపై కేంద్ర మంత్రి సమీక్ష

- **మహారాష్ట్ర సీఎంతో కిషన్ రెడ్డి భేటీ**
- **పారిశ్రామిక వృద్ధి, ఉపాధి అవకాశాలపై చర్చ**
- **రాష్ట్ర అభివృద్ధికి కీలక రంగాల బలోపేతంపై దృష్టి**

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ముంబైలో సమావేశమయ్యారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ దూబే కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. బొగ్గు, గనుల రంగాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. మహారాష్ట్రలో అమలవుతున్న బొగ్గు, గనుల రంగ ప్రాజెక్టుల పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు. వివిధ ప్రాజెక్టుల అమలు పరిస్థితి, భవిష్యత్ కార్యాచరణ, రంగ అభివృద్ధికి అవసరమైన చర్యలపై అధికారులు వివరాలు అందించారు. పారిశ్రామిక వృద్ధికి బొగ్గు, గనుల రంగాలు కీలకమని సమావేశంలో అభిప్రాయపడ్డారు. పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాల సరఫరా, ఉత్పత్తి సామర్థ్యాల పెంపు, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలపై చర్చించారు.

రాష్ట్రంలో ఉపాధి అవకాశాల పెంపుకు ఈ రంగాలు మరింత దోహదపడేలా చర్యలు తీసుకోవాలని నాయకులు సూచించారు. కొత్త ప్రాజెక్టుల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో గనుల, బొగ్గు రంగాల పాత్రను మరింత విస్తరించే అంశంపై కూడా చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని నిర్ణయించారు.

సమావేశం అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ బొగ్గు, గనుల రంగాల అభివృద్ధి దేశ ఆర్థిక పురోగతికి కీలకమని పేర్కొన్నారు. పరిశ్రమల వృద్ధి, ఉపాధి కల్పన, రాష్ట్రాభివృద్ధి లక్ష్యాల సాధనకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని తెలిపారు.

# గిరిజన సమాజ సాధికారతకు ఆధ్యాత్మిక చైతన్యం అవసరం

- **బేతూల్‌లో కార్యక్రమానికి హాజరైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**
- **అభివృద్ధి-సంస్కృతి సమతుల్యతే సమాజ బలానికి పునాది**

గిరిజన సమాజ సాధికారతకు ఆధ్యాత్మిక చైతన్యం ఎంతో అవసరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని బేతూల్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన 'ఆధ్యాత్మిక చైతన్యం ద్వారా గిరిజన సమాజ సాధికారత' కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ అభివృద్ధి, సంస్కృతి మధ్య సమతుల్యతే బలమైన, సంపన్నమైన సమాజ నిర్మాణానికి పునాదిగా నిలుస్తుందని అన్నారు. కేవలం ఆర్థిక ప్రగతినే అభివృద్ధిగా చూడకుండా, సాంస్కృతిక విలువలు, సంప్రదాయాలను కూడా పరిరక్షించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. మన మూలాలు, జీవన విలువల నుంచి స్ఫూర్తి పొందుతూ జరిగే అభివృద్ధే నిజమైన అభివృద్ధి అని రాష్ట్రపతి పేర్కొన్నారు.



సమాజపు మూల స్వరూపాన్ని కాపాడుకుంటూనే ఆధునికతను స్వీకరించడం ద్వారా స్థిరమైన పురోగతి సాధ్యమవుతుందని తెలిపారు. సంప్రదాయాలు, సంస్కృతిని బలోపేతం చేసే అభివృద్ధి విధానాలే దేశ భవిష్యత్తుకు మేలు చేస్తాయని అన్నారు.

గిరిజన సమాజం భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో కీలక పాత్ర పోషించిందని ఆమె కొనియాడారు. ప్రకృతితో మమేకమై జీవించే గిరిజనుల జీవన విధానం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. వారి సంప్రదాయ జ్ఞానం, విలువలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆధ్యాత్మిక చైతన్యం వ్యక్తిత్వ వికాసానికి, సమాజ పురోగతికి దోహదపడుతుందని రాష్ట్రపతి అన్నారు. నైతిక విలువలు, సామాజిక బాధ్యత, పరస్పర గౌరవం వంటి అంశాలను పెంపొందించడంలో ఆధ్యాత్మికత కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. గిరిజన యువత విద్యతో పాటు విలువల ఆధారిత జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

# పీ. కక్కన్ జయంతికి ఉపరాష్ట్రపతి నివాళి

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కర్త, రాజనీతిజ్ఞుడు పి. కక్కన్ జయంతి సందర్భంగా భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఘన నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చేసిన సేవలను, సమాజ అభ్యున్నతి కోసం సాగించిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న కక్కన్ దేశ స్వేచ్ఛ కోసం జైలు శిక్షను కూడా అనుభవించారని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. జాతీయ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. దేశభక్తి, ప్రజాసేవల పట్ల ఆయన అంకితభావం ఆదర్శప్రాయమని కొనియాడారు.




సామాజిక సమానత్వం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కక్కన్ నిరంతరం కృషి చేశారని ధన్‌కర్ పేర్కొన్నారు. సమాజంలో అణగారిన వర్గాలకు న్యాయం, గౌరవం, సమాన అవకాశాలు కల్పించేందుకు ఆయన చేసిన సేవలు ఎంతో గొప్పవని అన్నారు. సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం తరతరాలకు మార్గదర్శకమని వివరించారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో కూడా కక్కన్ కీలక పాత్ర పోషించారని ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు. రాజ్యాంగ సభ సభ్యుడిగా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణంలో తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. భారత గణతంత్ర వ్యవస్థ బలోపేతానికి ఆయన చేసిన కృషిని ప్రశంసించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# 'పెద్ది'కి కొత్త ఊపు.. అదనపు సన్నివేశాలతో రీలోడెడ్ వెర్షన్




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' చిత్రానికి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను చిత్రబృందం ప్రకటించింది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇప్పుడు 'రీలోడెడ్ వెర్షన్' రూపంలో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.
సినిమాలో దాదాపు 5 నిమిషాల 56 సెకన్ల నిడివి గల అదనపు సన్నివేశాలను జోడించి నేటి నుంచి థియేటర్లలో ప్రదర్శిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. ఈ కొత్త వెర్షన్ ద్వారా కథలోని భావోద్వేగాలు, పాత్రల మధ్య అనుబంధాలను మరింత బలంగా చూపించనున్నట్లు సమాచారం. అదనంగా చేర్చిన సన్నివేశాల్లో కథానాయిక జాన్వీ కపూర్‌కు సంబంధించిన పలు భావోద్వేగ క్షణాలు ఉండగా, ప్రముఖ నటుడు జగపతి బాబు పాత్రకు సంబంధించిన కీలక ఘట్టం కూడా చోటు చేసుకుంది. ఈ సన్నివేశాలు సినిమా కథనాన్ని మరింత బలపరుస్తాయని చిత్రబృందం పేర్కొంది. ఇప్పటికే ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతున్న 'పెద్ది'కి ఈ రీలోడెడ్ వెర్షన్ మరింత బలం చేకూరుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు, అభిమానులను దృష్టిలో పెట్టుకుని ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

# వెంకీ-కళ్యాణ్‌రామ్ మల్టీస్టారర్‌కు శ్రీకారం



టాలీవుడ్‌లో మరో భారీ మల్టీస్టారర్ చిత్రానికి అధికారికంగా శ్రీకారం చుట్టారు. విజయవంతమైన దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్‌రామ్ హీరోలుగా తెరకెక్కనున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్ర పూజా కార్యక్రమాలు గురువారం హైదరాబాద్‌లో వైభవంగా నిర్వహించారు.
ఈ వేడుకకు ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్ర రావు, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు సినీ ప్రముఖులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. చిత్రానికి సంబంధించిన కథానాయికల వివరాలను కూడా ఈ సందర్భంగా అధికారికంగా ప్రకటించారు.
ఈ వినోదాత్మక కుటుంబ కథా చిత్రంలో వెంకటేష్ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్ నటించనుండగా, కళ్యాణ్‌రామ్‌కు జోడీగా యువ కథానాయిక కృతి శెట్టి కనిపించనుంది. ఇద్దరు హీరోలు, ఇద్దరు కథానాయికల కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా మారింది.
చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించనున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంస్థలు భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి. అనిల్ రావిపూడికి బాగా కలిసొచ్చిన సంక్రాంతి సీజన్‌ను ఈ సినిమాకూ ఎంపిక చేశారు. 2027 సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు లక్ష్యంగా పెట్టుకున్నారు.

# వెంకీ-త్రివిక్రమ్ సినిమాపై క్రేజీ బజ్



విక్టరీ వెంకటేష్ అభిమానులకు వరుసగా శుభవార్తలు అందుతున్నాయి. ఇటీవల అనిల్ రావిపూడి దర్శకత్వంలో కొత్త సినిమా ఘనంగా ప్రారంభమైన నేపథ్యంలో, ఇప్పుడు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో వెంకటేష్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' చిత్రంపై సినీ వర్గాల్లో భారీ చర్చ సాగుతోంది.
చాలా ఏళ్ల విరామం తర్వాత వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో సినిమా రూపొందుతుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన చిత్రాలు మంచి విజయాలు సాధించడంతో ఈసారి కూడా మరో విజయాన్ని అందుకుంటారనే నమ్మకం అభిమానుల్లో కనిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను 2026 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే విడుదల తేదీపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రముఖ నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నారా రోహిత్, పూజిత పొన్నాడ కీలక పాత్రల్లో నటించనున్నారు. అలాగే రావు రమేష్, బ్రహ్మాజీ, నరేష్ తదితర ప్రముఖ నటులు కూడా ముఖ్య పాత్రలు పోషించనున్నారు.ఈ చిత్రానికి ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నాడు. త్రివిక్రమ్ ప్రత్యేక శైలిలో ఉండే కుటుంబ భావోద్వేగాలు, వినోదభరిత సంభాషణలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.
ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం. విడుదల తేదీపై అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'దృశ్యం 3' తెలుగు విడుదలకు కోర్టు బ్రేక్



మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో రూపొందిన 'దృశ్యం 3' చిత్ర తెలుగు డబ్బింగ్ వెర్షన్ విడుదలకు న్యాయపరమైన అడ్డంకులు ఎదురయ్యాయి. తెలుగు హక్కుల వివాదం నేపథ్యంలో మద్రాస్ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, తెలుగు వెర్షన్ ఓటీటీ విడుదలను తాత్కాలికంగా నిలిపివేసింది.'దృశ్యం' చిత్ర తొలి తెలుగు రీమేక్‌కు దర్శకత్వం వహించిన దర్శకురాలు శ్రీప్రియ, ఆమెకు చెందిన రాజ్‌కుమార్ థియేటర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కోర్టును ఆశ్రయించాయి. 'దృశ్యం' ఫ్రాంచైజీకి సంబంధించిన తెలుగు రీమేక్ హక్కులు తమవేనని, అలాంటి పరిస్థితిలో మూడో భాగాన్ని నేరుగా డబ్బింగ్ రూపంలో విడుదల చేయడం ఒప్పంద నిబంధనలకు విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నాయి. పిటిషనర్ల వాదనలను ప్రాథమికంగా పరిశీలించిన న్యాయస్థానం, తదుపరి విచారణ పూర్తయ్యే వరకు 'దృశ్యం 3' తెలుగు డబ్బింగ్ వెర్షన్‌ను ఓటీటీ వేదికలపై విడుదల చేయరాదని ఆదేశించింది. దీంతో జూన్ 18 నుంచి ప్రేక్షకులకు అందుబాటులోకి రావాల్సిన తెలుగు వెర్షన్ విడుదల నిలిచిపోయింది. గతంలో 'దృశ్యం', 'దృశ్యం 2' చిత్రాలు తెలుగులో ప్రముఖ నటుడు వెంకటేశ్ ప్రధాన పాత్రలో రీమేక్ అయ్యి భారీ విజయాలను అందుకున్నాయి. ఈ నేపథ్యంలో మూడో భాగాన్ని కూడా తెలుగులో రీమేక్ చేస్తారనే అంచనాలు నెలకొన్నాయి. అయితే నిర్మాతలు ఈసారి రీమేక్‌కు బదులుగా నేరుగా తెలుగు డబ్బింగ్ వెర్షన్‌ను విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయమే ప్రస్తుతం వివాదానికి దారితీసింది. తెలుగు రీమేక్ హక్కులు తమ వద్ద ఉన్నాయని పిటిషనర్లు వాదిస్తుండగా, మరోవైపు నిర్మాతల వాదనలు ఇంకా పూర్తిస్థాయిలో కోర్టు ముందు వినిపించాల్సి ఉంది. తదుపరి విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయం ఆధారంగా 'దృశ్యం 3' తెలుగు వెర్షన్ భవిష్యత్తు తేలనుంది. ప్రస్తుతం ఈ వ్యవహారం తెలుగు సినీ పరిశ్రమలో ఆసక్తికర చర్చకు దారితీసింది.



# ఉదయపు అలవాట్లే నా బలం: సమంత

సినీ నటి సమంత తన జీవితంలో ఎదురైన మానసిక ఒత్తిడులు, ఆత్మన్యూనత భావాలను అధిగమించడంలో క్రమబద్ధమైన ఉదయపు దినచర్య కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. ఇటీవల అభిమానులతో ముచ్చటించిన ఆమె, తన రోజువారీ అలవాట్ల గురించి వివరించారు.
ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు నిద్రలేస్తానని సమంత తెలిపారు. నిద్రలేచిన వెంటనే కృతజ్ఞతా డైరీ రాయడం తన మొదటి పని అని చెప్పారు. జీవితంలో లభించిన మంచి విషయాలను గుర్తు చేసుకుంటూ వాటిని డైరీలో నమోదు చేయడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుందని వివరించారు.
అనంతరం కొద్దిసేపు ఎండలో గడుపుతానని, తర్వాత శ్వాస వ్యాయామాలు చేసి దాదాపు అరగంట పాటు ధ్యానం చేస్తానని పేర్కొన్నారు. ఈ అలవాట్లు తనలోని ప్రతికూల ఆలోచనలను తగ్గించి, మానసిక స్థైర్యాన్ని పెంచాయని చెప్పారు.
ప్రతి వ్యక్తిలోనూ భయాలు, సందేహాలు, ఆత్మన్యూనత భావాలు సహజమేనని సమంత అభిప్రాయపడ్డారు. అయితే క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవాటు చేసుకుంటే వాటిని అధిగమించడం సులభమవుతుందని సూచించారు. తన అనుభవం ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్నానని తెలిపారు.
ఇటీవల 'ట్యాపింగ్' అనే విధానాన్ని కూడా అనుసరిస్తున్నట్లు సమంత వెల్లడించారు. ఇది శరీరంలోని శక్తి సమతుల్యతను కాపాడటంతో పాటు మానసిక ఒత్తిడి, శారీరక నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుందని చెప్పారు.
ఈ అలవాట్లన్నింటినీ ఒకేసారి ప్రారంభించాల్సిన అవసరం లేదని, మొదట ఒకటి లేదా రెండు మంచి అలవాట్లను జీవితంలో భాగం చేసుకుంటే క్రమంగా సానుకూల మార్పులు కనిపిస్తాయని అభిమానులకు సూచించారు.
ఇదిలా ఉండగా, సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రం జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మణుగూరులో 80 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అక్రమ రవాణాదారుల అరెస్ట్
- వాహన తనిఖీల్లో బయటపడిన గంజాయి తరలింపు
- కారు స్వాధీనం చేసుకున్న పోలీసులు

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):**

మణుగూరు మండలంలోని తోగ్గుడెం ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు. పోలీసులకు అందిన సమాచారంతో తోగ్గుడెం వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక కారును ఆపి తనిఖీ చేయగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకుని అందులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

తనిఖీల్లో మొత్తం 80 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం. నిందితుల నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన కారును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారు అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ వ్యవహారానికి సంబంధించిన ఇతర వ్యక్తుల పాత్రపై కూడా ఆరా తీస్తున్నారు.

నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు. అనంతరం వారిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తారని హెచ్చరించారు. ప్రాంతంలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక నిఘా కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రజలు వెంటనే సమాచారం అందించాలని కోరారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతర తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

# అటవీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వ వన సంరక్షణ పురస్కారాలు

- మంత్రి కొండా సురేఖ కృషితో కొత్త పురస్కారాల విధానం
- అటవీ సంపద రక్షణలో విశిష్ట సేవలకు గుర్తింపు
- నగదు బహుమతులు, ప్రోత్సాహకాలతో సత్కారం



**హైదరాబాద్, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):**

అటవీ సంపద పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. వన మహోత్సవం-2026 ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని "తెలంగాణ రాష్ట్ర వన సంరక్షణ ప్రతిభా పురస్కార పతక నియమావళి-2026"ను ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఈ నిర్ణయం వెనుక అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన కృషి కీలకంగా నిలిచిందని అధికారులు పేర్కొన్నారు. అటవీ సంపద సంరక్షణ, అటవీ భూముల రక్షణ, వన్యప్రాణుల పరిరక్షణ, అక్రమ కలప రవాణా నియంత్రణ వంటి రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న అటవీ సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కల్పించాలని మంత్రి కొండా సురేఖ గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం కొత్త పురస్కారాల విధానానికి ఆమోదం తెలిపింది. ఈ కొత్త విధానంలో భాగంగా నాలుగు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రవేశపెట్టారు. తెలంగాణ వన సంరక్ష పతకం (రజత పతకం), తెలంగాణ ఉత్తమ వన సంరక్ష పతకం (వెండి పతకం), తెలంగాణ విశిష్ట వన సంరక్ష పతకం (బంగారు పతకం), తెలంగాణ ముఖ్యమంత్రి వన శౌర్య పతకం (ప్రత్యేక బంగారు పతకం) పేర్లతో అవార్డులను ప్రదానం చేయనున్నారు. అటవీ సంరక్షణలో అసాధారణ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎంపిక చేసి ఈ పురస్కారాలు అందజేయనున్నారు. పురస్కారాలతో పాటు నగదు బహుమతులు, నెలవారీ ప్రోత్సాహకాలను కూడా ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ వన సంరక్ష పతకానికి రూ.10 వేల నగదు, ఉత్తమ వన సంరక్ష పతకానికి రూ.15 వేల నగదు, విశిష్ట వన సంరక్ష పతకానికి రూ.20 వేల నగదు, ముఖ్యమంత్రి వన శౌర్య పతకానికి రూ.25 వేల నగదు బహుమతిని అందజేయనున్నారు. అదనంగా నెలవారీ ప్రోత్సాహక నగదు కూడా ఇవ్వనున్నారు.

అటవీ భూముల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ నేరాల నియంత్రణ, అగ్ని ప్రమాదాల నివారణ, నర్సరీల నిర్వహణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, జీఐఎస్, ఎంఐఎస్ వ్యవస్థల వినియోగం, పరిశోధన వంటి రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఈ అవార్డులకు ఎంపిక చేయనున్నారు. అటవీ శాఖలో సేవాస్ఫూర్తి, అంకితభావం, విధి పట్ల నిబద్ధతను పెంపొందించడమే ఈ పురస్కారాల ప్రధాన లక్ష్యమని మంత్రి కొండా సురేఖ తెలిపారు. అటవీ సంపద రక్షణలో విశేష సేవలు అందిస్తున్న ఉద్యోగులను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అటవీ శాఖ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. తన విజ్ఞప్తికి స్పందించి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అమల్లోకి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సంక్షేమం, ఉద్యోగుల ప్రోత్సాహమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం లేదా ప్రభుత్వం నిర్ణయించే ప్రత్యేక సందర్భాల్లో ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

# సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడతాం

- రామగుండం ఓసీపీ-3, బేస్ వర్క్‌షాప్‌ను సందర్శించిన కవిత
- కార్మికులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలపై చర్చ
- హెచ్‌హెచ్‌డీ, డిపెండెంట్ ఉద్యోగాలు, వైద్య సేవలపై హామీలు





**పెద్దపల్లి, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా రామగుండం ఓసీపీ3, బేస్ వర్క్‌షాప్‌లను సందర్శించిన ఆమె కార్మికులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సింగరేణిలో కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. అధికారులు, యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు కార్మికుల్లో ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. కార్మికులు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే మెమోలు, ఛార్జ్‌షీట్లు ఇస్తున్నారని ఆరోపించారు. కార్మికుల పట్ల వ్యవహార శైలిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో అమలులోకి వచ్చిన కొన్ని విధానాల వల్ల కార్మికులకు ఆర్థిక నష్టం జరిగిందని తెలిసిందని, ఆ విషయంలో తమవల్ల జరిగిన తప్పులకు క్షమాపణలు చెబుతున్నట్లు కవిత పేర్కొన్నారు. హెచ్‌హెచ్‌డీ ప్రయోజనాలు పూర్తిస్థాయిలో కార్మికులకు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల ప్రయోజనాల విషయంలో ఆత్మపరిశీలన చేసుకుని అవసరమైన మార్పులు తీసుకువస్తామని తెలిపారు.

సింగరేణిలో వైద్య సేవలు అందరికీ సమానంగా అందాలని, మెడికల్ స్కీమ్ అమలులో పారదర్శకత ఉండాలని కోరారు. రిఫరల్ ఆస్పత్రుల్లో కార్మికుల నుంచి అదనపు వసూళ్లు జరగకుండా చూడాలని సూచించారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి మెడికల్ బోర్డును నెలకు రెండుసార్లు నిర్వహించాలని కూడా కోరారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను కూడా కవిత ప్రస్తావించారు. ఈపీ ఆపరేటర్లకు పదోన్నతులు ఆలస్యమవుతున్నాయని, వారి భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. నాసిరకం వాహనాల వల్ల కార్మికులు ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి వస్తోందని అన్నారు. ఓపెన్‌కాస్ట్ ప్రాంతాల్లో దుమ్ము సమస్య నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగరేణి కార్మికుల నివాస సమస్యలపై కూడా స్పందించిన కవిత, ఖాళీగా ఉన్న క్వార్టర్లను అభివృద్ధి చేసి కార్మికులకు అందించాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక న్యాయం అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ తమ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. సింగరేణి కార్మికుల ఆశీర్వాదంతో మరింత బలంగా పోరాడి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# రామంతాపూర్ చెరువు పునరుద్ధరణ పనులకు శ్రీకారం

- భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- వరద నివారణ, పర్యావరణ పరిరక్షణకు కీలక చర్య
- 36 కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయింపు

**హైదరాబాద్, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):**



నగరంలోని చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇస్తున్న హైడ్రా మరో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని రామంతాపూర్ పెద్ద చెరువు పునరుద్ధరణ పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం భూమిపూజ చేసి ప్రారంభించారు. నగరంలో వరద ముప్పును తగ్గించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడే లక్ష్యంతో ఈ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రామంతాపూర్ చెరువు ఎఫ్‌టీఎల్ విస్తీర్ణం సుమారు 30 ఎకరాలు కాగా, అందులో దాదాపు 16 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. వీటిలో 12 ఎకరాల మేర శాశ్వత నిర్మాణాలు ఉండటంతో వాటిని ప్రస్తుతానికి యథాతథంగా ఉంచారు. మరో నాలుగు ఎకరాల్లో ఉన్న తాత్కాలిక గుడిసెలు, షెడ్లను తొలగించి చెరువు పునరుద్ధరణకు అవసరమైన భూమిని అందుబాటులోకి తీసుకువచ్చారు.

హైడ్రా రెండో విడత చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఈ పనులు చేపడుతోంది. ఇప్పటికే తొలి విడతలో ఆరు చెరువుల పునరుద్ధరణ పూర్తిచేయగా, ప్రస్తుతం మరో 14 చెరువుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రామంతాపూర్ చెరువు అభివృద్ధికి సుమారు రూ.19 కోట్ల వ్యయం చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ చెరువు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందితే పరిసర ప్రాంతాల్లో వరదల ముప్పు గణనీయంగా తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో కూడా ఈ చెరువు కీలక పాత్ర పోషించనుంది. నగరంలో వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను తగ్గించేందుకు చెరువుల పునరుద్ధరణ ఎంతో అవసరమని అధికారులు పేర్కొన్నారు.

చెరువు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న గుడిసెవాసుల సమస్యలను కూడా హైడ్రా పరిష్కరించింది. వర్షాకాలంలో చెరువు నిండినప్పుడు గుడిసెలు మునిగిపోవడం వల్ల ప్రతి సంవత్సరం ఇబ్బందులు ఎదుర్కొంటున్న 36 కుటుంబాలకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేసింది. హైడ్రా అధికారులు నేరుగా వారితో మాట్లాడి ప్రభుత్వ నిర్ణయాన్ని వివరించడంతో వారు స్వచ్ఛందంగా పునరుద్ధరణ పనులకు సహకరించారు. చెరువుల పరిరక్షణ అనేది కేవలం నీటి వనరులను కాపాడటమే కాకుండా నగర భవిష్యత్తును సురక్షితం చేయడమేనని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. రామంతాపూర్ చెరువు పునరుద్ధరణ పూర్తయిన తర్వాత నగర పర్యావరణానికి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఇది ఆదర్శ ప్రాజెక్టుగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ

- పీవీ నరసింహారావును ఆదర్శంగా తీసుకోవాలని కేటీఆర్ పిలుపు
- మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభం
- పాఠశాల అభివృద్ధికి పూర్తి సహకారం హామీ

**హైదరాబాద్, జూన్ 18 (తెలంగాణ ముచ్చట్లు):**




మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. బేగంపేటలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌ను సందర్శించిన ఆయన విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. చిన్నారులతో మమేకమై వారి చదువులు, అభిరుచుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో గడిపిన సమయం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పీవీ నరసింహారావు బహుభాషా కోవిదుడిగా, దూరదృష్టి గల నాయకుడిగా దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. 16 భాషల్లో ప్రావీణ్యం సాధించిన ఆయన జీవితం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

విద్యతో పాటు పోషకాహారం కూడా విద్యార్థుల అభివృద్ధికి ఎంతో అవసరమని కేటీఆర్ అన్నారు. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే చిన్నారులకు నాణ్యమైన విద్య, మెరుగైన సదుపాయాలు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలకు తమ మద్దతు కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణలో గతంలో విద్యారంగ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేసిన కేటీఆర్, 2023లో ప్రారంభించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రస్తావించారు. విద్యార్థుల విద్యా, ఆరోగ్యాభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలు మరింత విస్తృతంగా అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు.

స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌కు అవసరమైన అదనపు తరగతి గదులు, ఆధునిక గ్రంథాలయ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి సేవలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.





Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in